సాక్షి ములుగు

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



ఎలక్ట్రిక్ వాహనాలకు విద్యుత్ అందించాలి - 8లో

ఎలక్ట్రిక్ వాహనాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ సూచించారు.



కాంట్రాక్ట్ లెక్చరర్ల ర్యాలీ

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూ పరిపాలనభవనం నుంచి ర్యాలీ నిర్వహించారు. - 8లో

గరిష్టం/కనిష్టం $29^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గణనాథుడికి పూజలు



ములుగు: జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడికి మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఎమ్మెల్యే సీతక్క పీఏ ముక్తి శ్రీను, అలెంబాబు భక్తులకు అన్నదానం చేశారు. స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రాజేందర్, కొట్టె రాజిరెడ్డి, నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంకు వినతి



ములుగు రూరల్: మండల పరిధిలోని బరిగలానిపల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ వీరబోయిన రాజేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ డిపో -2 మేనేజర్ బాను కిరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన డీఎం గ్రామానికి బస్సు సర్వీస్ నడిపే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి



వాజేడు: మండల పరిధిలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు భీరెడ్డి సాంబశివ కోరారు. మండల పరిధిలోని గుడిసెవాసుల పోరాట కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలోని పూసూరు రిసార్ట్స్‌లో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశాలకు వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి వెంకట్, సహాయ కార్యదర్శి శివదశన్ హాజరు కానున్నట్లు వివరించారు. ఈ సమావేశాల్లో ముఖ్యంగా ఇంటి, భూ సమస్యలపై చర్చించ నున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట గ్యానం వాసు, చిట్టిబాబు, కొప్పుల రఘుపతి, దేవయ్య, కృష్ణబాబు, దామోదర్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి



ములుగు రూరల్: మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ముత్యాల రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వంట కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వంట కార్మికులకు వేతనాలు పెంచి చెల్లించకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు పెండింగ్ వేతనాలను ఖాతాలలో జమ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సామల రమ, గున్నాల రాజకుమారి, ఉమాదేవి, సమ్మక్క, లక్ష్మీ, రాధ, పద్మ, రాజక్క, రవీంద్ర, కమలక్క, భాగ్య, కనకలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ నాయకుల సంబురాలు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులకు యాజమాన్యం 32శాతం లాభాల వాటా ప్రకటించడం పట్ల తెలంగాణ బొగ్గు గని కార్మికులు మంగళవారం రాత్రి సంబురాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో యూనియన్ నాయకులు టపాకాయలు పేల్చి సంబురాలు జరుపుకున్నారు. 30 నుంచి 32శాతం వాటాను ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

నిమజ్జనానికి వేళాయె..

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పట్టణ వాసులకు తోపుకుంటలో అనుమతి
- 300 మంది పోలీస్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రత

ములుగు: తొమ్మిది రోజుల పాటు మండపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన గణనాథుడు నేడు (బుధవారం) గంగమ్మ చెంతకు చేరనున్నాడు. ఈ మేరకు భక్త మండలి సభ్యులు, అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. మంగళవారం భక్తులు పోటాపోటీగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఐదుచోట్ల నిమజ్జనానికి అనుమతులు

గోదావరి నది తగ్గుముఖం పట్టడంతో వాజేడు, వెంకటాపురం(కె), కన్నాయిగూడెం, ఏటూరునాగారం, ఎస్ఎస్ తాడ్వాయి మండలాల వారికి జంపన్న వాగులో, పస్రా వాసులకు దయ్యాలవాగు, జంపన్నవాగు, గోవిందరావుపేట మండల వాసులకు రాఘవపట్నం వద్ద, చల్వాయి ప్రాంత వాసులకు గౌరారం చెరువు, ములుగు పట్టణం, చుట్టుపక్కల గ్రామాలకు తోపుకుంటలో అనుమతి ఇచ్చారు. ఇక రాజుపేట వాసులు పక్కనే ఉన్న గోదావరి, కమలాపురం వాసులు ఇంటెక్ వెల్ సమీపంలో నిమజ్జనం చేస్తారు. భక్తులు లోపలికి దిగకుండా కంచెలను ఏర్పాటు చేశారు. వెంకటాపురం(ఎం), లోని రామప్ప, గోవిందరావుపేట మండల పరిధిలోని లక్నవరంలో నీటిలోతు ఎక్కువగా ఉండడంతో అనుమతిని అధికారులు నిరాకరించారు. ఈ రెండు చెరువులకు వెళ్లకుండా బారికేడ్లు, సిబ్బంది ఏర్పాటు చేస్తారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వెంకటేశ్వర్

300 మందితో భద్రత

గణేశ్ నిమజ్జనం విషయంలో జిల్లా, స్టేషన్ వారీగా అధికారులు, సిబ్బందికి ట్రెనింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగానే సివిల్, సీఆర్‌పీఎఫ్ బలగాలను రంగంలోకి దింపనున్నారు. ముళ్లకట్ల, జంపన్నవాగులో ఎస్పీ దగ్గరుండి పరిస్థితిని సమీక్షిస్తారు. తోపుకుంట వద్ద డీఎస్పీ రవీందర్, డీపీఓ వెంకన్న ఎస్సై వెంకటేశ్వర్‌లు డోజర్ ద్వారా రాళ్లను తొలగించి చదును చేయించారు. అన్ని ప్రాంతాల్లో క్రేన్‌లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం చేసే క్రమంలో భక్తులు, పోలీసు సిబ్బంది లైఫ్ జాకెట్లతో ఉంటారు. మిగతా వారిని కట్టమీదకు, నిమజ్జన చుట్టు పక్కలకు రానివ్వరు. ములుగు నుంచి మాధరరావుపల్లి, మదనపల్లి, జగ్గన్నపేట వెళ్లే వారికి అన్నంపల్లి నుంచి దారి మళ్లించారు. సాధ్యమైనంత వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రం నుంచి తోపుకుంట వరకు వెలుగులు విరజిమ్మే ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు.

సామాన్యులకు ఇబ్బందులు కలిగించొద్దు..

గణేశ్ నిమజ్జన సయయంలో ధర్మజాగరణ సమితి సభ్యులు ఓపికగా ఉండాలి. సామాన్యులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలి. దారి లేని వారికి దారి ఇవ్వాలి. ముఖ్యంగా యువత అందరికి ఆదర్శంగా నిలవాలి. ప్రధాన ప్రాంతాల్లో క్రేన్లతో నిమజ్జనం చేయిస్తాం.

\- గాష్ ఆలం, ఎస్పీ



తోపుకుంటను శుభ్రం చేస్తున్న సిబ్బంది



ఎల్ఈడీ కాంతుల్లో తోపుకుంట



భక్తులు లోపలికి వెళ్లకుండా బారికేడ్లు

‘ఫర్టిలిటీ’ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నవ్య, కలెక్టర్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: సంతానం కోసం వేచి చూసే వారు ఫర్టిలిటీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఫర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ నవ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి ఒయాసిస్ ఇన్ఫినిటీ వరంగల్ వారి సహకారంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచనలతో ములుగులో సెంటర్‌ను మంగళవారం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వివాహమై పిల్లలు కలుగని భార్యాభర్తలు ధైర్యంగా డాక్టర్ దగ్గరకు వెళ్లాలన్నారు. మనస్సు విప్పి వారి సమస్యను వివరించి వైద్యుల సలహాలు తూచ తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం డాక్టర్ నవ్య మాట్లాడారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌లో 4,280 మందికి టెస్టులు నిర్వహించగా 30 మంది సంతానలేమితో ఇబ్బందులు పడుతున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రతీ నెలలో చివరి వారంలో ఆస్పత్రిలో ఉచిత చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ములుగులో అందుబాటులో ఉండే వైద్యులతో ఆరోగ్య సమస్యలపై పూర్తిగా చర్చించవచ్చని తెలిపారు. సమస్యను బట్టి మొదటి రెండు దశల్లో ట్రీట్‌మెంట్ ఇస్తామని, సమస్య కాస్త ఎక్కువగా ఉంటే ఐవీఎఫ్ లాంటి తదితర పద్ధతులు అమలు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ఈ నెల 28వ తేదీన వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుచే ప్రారంభించనున్న స్పెషల్ నియోనెటల్ కేర్ యూనిట్ ఏర్పాట్లను ముందస్తుగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు మంత్రి హరీశ్‌రావు రాక

సభాస్థలిని పరిశీలించిన మంత్రి సత్యవతి

ములుగు: పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడానికి రేపు(గురువారం) జిల్లా కేంద్రానికి వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన, మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతితో కలిసి సభాస్థలిని మంగళవారం పరిశీలించారు. బండారుపల్లి రోడ్డులోని తంగేడు స్టేడియం సరిపోతుందా అని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గాష్ ఆలంను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలోని మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించారు. మంత్రి వెంట రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్‌యాదవ్, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, డీపీఓ వెంకయ్య, కలెక్టరేట్ కార్యాలయ అధికారి శ్యామ్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి, నాగజ్యోతి

పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ

ఎస్పీ గాష్ ఆలం

ములుగు: రజాకార్లకు ఎదురొడ్డి వీరోచితంగా పోరాడిన తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని ఎస్పీ గాష్ ఆలం అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆమె చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక ఐలమ్మ అన్నారు. మాటలను తూటాలుగా మార్చుకొని అక్రమార్కుల గుండెల్లో బడబాగ్ని రగిలించి ప్రజల్లో పోరాట పటిమను నింపారని తెలిపారు. ఎదురొడ్డి నిలబడితే ఎంతటి విజయాన్ని అయినా సాధించవచ్చనే దానికి ఐలమ్మ పోరాటం నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ సురేష్‌బాబు, ఆర్ఐ అడ్మిన్ ఎస్సై సతీష్, ఆర్ఐ హోంగార్డు వెంకటనారాయణ, డీపీఆర్‌బీ ఎస్సై కమాలాకర్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ

ఓటరు జాబితా పకడ్బందీగా సిద్ధం చేయాలి

ఎస్ఎస్ తాడ్వాయి: ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఓటరు జాబితాపై ఏఆర్ఓలు, సూపర్వైజర్లు, బీఎల్ఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఓటరు జాబితా సిద్ధం చేస్తున్న తీరును పరిశీలించారు. ఓటరు జాబితాలో 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్ల నమోదు, నవరణ, దివ్యాంగుల నమోదుకు ఫారం నంబర్ 6 ద్వారా ఓటర్ల నమోదు, ఫారం నంబర్ 7, 8 ద్వారా మరణించిన, డబుల్ ఓటర్లు, శాశ్వతంగా వలస పోయిన ఓటర్ల తొలగింపు ప్రక్రియను, చేసిన మార్పులు - చేర్పుల తీరును పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా బీఎల్ఓలు, సూపర్‌వైజర్లను అడిగి, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా రూపొందించి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రవీందర్, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ, దోమల మందు స్ప్రే, మిషన్ భగీరథ పనులపై సభ్యులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వెంకటరాణిసిద్దు మాట్లాడుతూ.. పట్టణంలో ప్రధాన సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయని చెప్పారు. ఇప్పటికే అన్ని రకాల పనుల్లో ముందంజలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ హరిబాబు, ఇన్‌చార్జ్ కమిషనర్ అనిల్‌కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేసిన పీఓ అంకిత్

ఏటూరునాగారం: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు తైక్వాండో కరాటే పోటీల్లో గెలుపొందగా మంగళవారం ఐటీడీఏ పీఓ అంకిత్ ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. ఈ నెల 25న రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ 2023 పోటీలను వరంగల్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు ఐటీడీఏ పరిధిలోని వెంకటాపురం(కె) మండలం చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పాల్గొని ప్రతిభ చూపగా మూడు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్, మూడు బ్రాంచ్ మెడల్స్ వచ్చాయి. గెలుపొందిన వారిలో హిమశ్రీ, రినా, అవంతి, నవ్యతో పాటు మరో పది మంది ఉన్నారు. ఏటూరునాగారం మండల పరిధిలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు బాలుర విభాగంలో పాల్గొని నాలి దయాకర్ సిల్వర్ మెడల్, వాసం సాగర్ బ్రాంచ్ మెడల్ సాధించారు. ఆశ్రమ పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఐటీడీఏ పీఓ అంకిత్ అభినందించి మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, స్పోర్ట్స్ పాఠశాలల విద్యార్థులకు తైక్వాండో శిక్షణ ఇస్తున్న పాయం సురేష్‌ను పీఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాయం నిశాంత్, మైపతి సంతోష్, శ్రీనివాస్, బాలాజీ, హన్మంతు, హన్మంతు, నాలి స్వామి పాల్గొన్నారు.



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న పీఓ అంకిత్

కాళేశ్వరాలయంలో గణపతి హోమం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయగణపతి దేవాలయంలో ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో గణపతి హోమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

దాతకు సన్మానం..

రూ.లక్ష విలువ గల ఓం నమఃశివాయ యంత్రాన్ని విరాళంగా దేవస్థానానికి అందజేసిన భక్తుడు సాంబయ్యను దేవస్థానం అధికారులు, ధర్మకర్తలు శాలువాతో సన్మానించారు.



గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆశ వర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి

ములుగు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తల డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆశ కార్యకర్తలు చేపట్టిన సమ్మెకు ఆయన మంగళవారం మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 18 వేలు అమలు చేయాలని, ప్రమాద బీమా, హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. ఆశ కార్యకర్తలపై పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. ఆశ కార్యకర్తలకు కంటి వెలుగు, లెప్రసీ, మలేరియా, టీబీ సర్వేలలో అత్యుత్తమ పాత్ర పోషించారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండబోయిన రవిగౌడ్, చంచు మంజుల, రమాదేవి, రజిత, వజ్ర, సమ్మక్క, యశోద, కవిత, సరిత, ధనలక్ష్మీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఆశ కార్యకర్తలు తమ డిమాండ్లు నెరవేర్చాలని తలపెట్టిన సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్ సమ్మె చేస్తున్న ఆశ వర్కర్లకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించడంతో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. అనేక సంవత్సరాలుగా తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్నో రకాలుగా ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఏజెన్సీలో ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటూ సలహాలు. సూచనలు ఇస్తూ, కరోనా కాలంలో ఆశ కార్యకర్తల సేవలను గుర్తించిన డబ్ల్యూహెచ్ఓ హెల్త్ గ్లోబల్ లీడర్లు అవార్డులు అందించిన వారి సేవాగుణం ప్రభుత్వానికి గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లీడర్స్ బొగ్గం సరిత, రామటెంకి అరుణ, మాధవి, స్వరూప, సరిత, వినోద, శారద, సాంబలక్ష్మి, కాళిక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేందర్



ఏటూరునాగారంలో మాట్లాడుతున్న దావూద్

అభివృద్ధికే పట్టం కట్టండి

చిట్యాల: ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందున.. రానున్న రోజుల్లోనూ ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బావుసింగ్‌పల్లిలో రూ.కోటి 60లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం, వరికోల్‌పల్లిలో రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్లు, వెంచరామి నుంచి అందుకుతండా వరకు రూ.2కోట్ల 56లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం, అందుకుతండాలో రూ.20లక్షలతో నూతన ఉప వైద్య కేంద్ర భవన నిర్మాణం, కాల్వపల్లిలో రూ.2కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కాల్వపల్లిలో సర్పంచ్ పులి సునీత-అంజిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, చిట్యాల, టేకుమట్ల జెడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ గణపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రవీందర్‌రావు పాల్గొన్నారు.



చిట్యాల: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

గణపురం: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు గణపురం మండలకేంద్రంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఎదుట ప్రధాన రహదారి పక్కన విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే రూ.5లక్షల ప్రత్యేక నిధులతో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పోలసాని లక్ష్మీనరసింహారావు, పీఎస్ఈఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, సర్పంచ్ దేవేందర్‌గౌడ్, ఎంపీటీసీ శివశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిపై దుష్ప్రచారం..

● వ్యక్తిపై కేసు నమోదు

తొర్రూరు: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావుపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు కథనం ప్రకారం మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన ఎండీ అమీజ్ ప్రముఖులపై వాట్సాప్, ఫేస్‌బుక్‌లో మంత్రి ఎర్రబెల్లిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. దీనిపై స్థానికుల ఫిర్యాదు మేరకు అమీజ్‌పై కేసు నమోదు చేశామన్నారు. అమీజ్‌కు మెసేజ్‌లు పంపించిన వ్యక్తిని కూడా గుర్తించి కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వీవీపీలను టార్గెట్ చేసి వారి ప్రతిష్టకు భంగం కలిగేలా మెసేజ్‌లు పోస్ట్‌చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

కామన్ మెస్ రీఓపెన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కామన్ మెస్‌ను రీఓపెన్ చేశారు. కార్డులు రెన్యూవల్ చేసుకున్న వారికి మంగళవారం మధ్యాహ్నం నుంచి మెస్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం 70మంది విద్యార్థులే మెస్ కార్డులు రెన్యూవల్ చేసుకున్నారని, ఇంకా 550 మందికిపైగా రెన్యూవల్ చేసుకోవాలని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ డాక్టర్ వై వెంకయ్య తెలిపారు. స్కాలర్‌షిప్‌లు పోనూ బకాయిల్లో రూ. 2,500 చెల్లించి మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా పద్మాక్షి హాస్టళ్లలో 600 మంది వరకు విద్యార్థినులు మెస్ కార్డులు రెన్యూవల్ చేసుకున్నారన్నారు. వీరికి ఇప్పటికే మెస్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు కూడా మెస్ రీఓపెన్ చేశామన్నారు.

కాకతీయుల కళా సంపద అద్భుతం



ఖిలా వరంగల్: కాకతీయుల శిల్ప కళా సంపద అద్భుతంగా ఉందని భారత ఎన్నికల సంఘం సెక్షన్ అధికారి మిథిలేష్ శర్మ అన్నారు. వరంగల్‌లో నిర్వహిస్తున్న ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటను సందర్శించారు. కాకతీయుల చరిత్ర గురించి గైడ్ రవియాదవ్ వివరించారు. కార్యక్రమంలో ఐనవోలు డీటీ రమేష్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ అజయ్, కేంద్రపురావస్తుశాఖ ఇన్‌చార్జ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత అంటే పాతరేయడమా?

కేయూ క్యాంపస్: కేయూ పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో పారదర్శకత అంటే విద్యార్థుల మెరిట్‌ను పాతరేయడమా అని ఏబీవీపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ అంబాల కిరణ్ అన్నారు. కేయూ వీసీ, రిజిస్ట్రార్లను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ దూరవిద్యాకేంద్రం ఆవరణలో విద్యార్థి జేఏసీ చేపట్టిన దీక్షలు మంగళవారంతో 21వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల శిబిరంలో ఆయన మాట్లాడారు. తాము విద్యార్థులమా..? లేక వీసీకి శత్రువులమా అని ప్రశ్నించారు. తిరుపతి, రాంబాబు, నాగరాజు, మనోహర్, రాజేష్, పాషా, రమేష్, నిఖిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.



గణపతికి ఘన వీడ్కోలిద్దాం..

ఆనందం.. విషాదం కావొద్దు

● నేడు నిమజ్జనం.. ఇలా చేద్దాం..
● శోభాయాత్రలో జాగ్రత్తలు మరవొద్దు
● పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి



నగరంలోని సిద్ధేశ్వరాలయం వద్ద ఉన్న సిద్ధేశ్వర గుండం వద్ద నిమజ్జన ఏర్పాట్లు

వరంగల్ అర్బన్ : ఆది దేవుడు బొజ్జ గణపయ్యను ఘనంగా ఆరాధించిన భక్తులు బుధవారం వీడ్కోలు పలికేందుకు సిద్ధమయ్యారు. మండపాల్లో విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చినా లంబోదరుడి శోభాయాత్రకు సన్నాహాలు పూర్తయ్యాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అంగరంగ వైభవంగా ఏకదంతుడిని సాగనంపే క్రమంలో ఆనందంలో ఏ క్షణమైనా విషాదంగా మారే పరిస్థితులు లేకపోలేదు. అందుకే విఘ్నలు తొలగించే విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవాన్ని భక్తి పారవశ్యంతో కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే విజయవంతంగా నిర్వహించుకోవచ్చు. నిమజ్జనోత్సవం సందర్భంగా మండపాల నిర్వాహకులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలి.

➡ నిమజ్జనోత్సవంలో తమ పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. వారికి ముందుగా పూర్తి స్థాయిలో సూచనలు, సలహాలు ఇవ్వాలి. సైడ్ వాల్ లేని భవనాలపై చివరన నిల్చొని, కూర్చొని చూడొద్దు. జనరేటర్, మైక్ విషయంలో నిబంధనలు పాటించాలి. గణేష్ మండపం పరిధిలో బాక్స్ టైపు స్పీకర్ వాడాలి. డీజే సౌండ్ సిస్టం అనుమతించొద్దు. సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం పగలు 55 డీబీ(ఏ) రాత్రి 45 బీ(ఏ) వాయిస్ లెవల్ ఉంచాలి. లౌడ్ స్పీకర్లను భక్తి గీతాలకు మాత్రమే వాడాలి. వాహన జనరేటర్‌కు మధ్య ఉన్న తీగలు తెగి షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఊరేగింపు సమయంలో వీధుల్లో ఉండే విద్యుత్ తీగలు ప్రతిమలకు తగలకుండా చూసుకోవాలి. విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుంటే వాటిని ఎత్తేందుకు ముందుగానే పొడవాటి కర్రను సిద్ధంగా ఉంచుకోవాలి.

ఈతరాని వారు నీటిలోకి వెళ్లొద్దు

వినాయక విగ్రహాలను ఊరేగింపు సమయంలో విద్యుద్దీకరణ కోసం ఉపయోగించే విద్యుత్ తీగలు నాణ్యంగా ఉండాలి. డ్రైవర్.. డ్రైవింగ్‌పైనే పూర్తి దృష్టి సారించాలి. ఎలాంటి మత్తు పానీయాలు, పదార్థాలు తీసుకోవద్దు. వాహనం నడిపే సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలి. ముందు, వెనుక భాగాల్లో పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తుండాలి. చెరువులు, కుంటల నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఈత రానివారు నిమజ్జన సమయంలో నీళ్లలోకి వెళ్లొద్దు. మండపాల నిర్వాహకులు నిమజ్జన సమయంలో పూర్తిగా అప్రమత్తంగా ఉండాలి.

నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

వరంగల్ క్రైం: గ్రేటర్ వరంగల్‌లో బుధవారం వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని ట్రాఫిక్ ఆంక్షలు ఉండనున్నట్లు సీపీ రంగనాథ్ తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీ పరిధి విగ్రహాలను తరలించే మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం 2 నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు భారీ వాహనాలకు దారి మళ్లింపులు, ఆంక్షలు ఉండనున్నట్లు సీపీ తెలిపారు. వాహనదారులు, గణేశ్ నవరాత్రి మండప నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ.. శోభాయాత్రను విజయవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ రంగనాథ్ కోరారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

ములుగు, భూపాలపల్లి నుంచి వచ్చే భారీ వాహనాలు హైదరాబాద్‌కు వెళ్లాల్సినవి ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వెళ్లాలి. భూపాలపల్లి, పరకాల నుంచి ఖమ్మం వెళ్లాల్సినవి ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్ పంపు నుంచి వెళ్లాలి.

- భూపాలపల్లి, పరకాల నుంచి వచ్చే భారీ వాహనాలు నర్సంపేట వైపు వెళ్లాల్సినవి కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్‌పీరీలు, గొర్రెకుంట మీదుగా వెళ్లాలి.
- ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే బస్సులు వయా పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, సీపీఓ, అంబేడ్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవి మాల్ మీదుగా బస్టాండ్ చేరుకోవాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి బయల్దేరి ములుగు, కరీంనగర్ వైపు వెళ్లాల్సిన బస్సు వయా ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సెంటర్, సీపీఓ ద్వారా కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపు వెళ్లాల్సిన బస్సులు వయా బాలసముద్రం, అదాలత్, హంటర్ రోడ్డు మీదుగా వెళ్లాలి.
- వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండ వైపు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి నుంచి రంగశాయిపేట మీదుగా నాయుడు పెట్రోల్ పంపు సెంటర్, ఉర్సుగుట్ట, అదాలత్, బాలసముద్రం మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.

ట్రాఫిక్ ఆంక్షలు ఇవీ..



రంగనాథ్, సీపీ

- సిద్ధేశ్వర గుండంలో నిమజ్జనం చేసిన తర్వాత వాహనాలు శాయంపేట వైపు వెళ్లే రోడ్డు ద్వారా వెళ్లాలి. ఆరు అడుగుల కన్నా ఎక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలతో కూడిన వాహనాలు, వినాయక విగ్రహాలతో కూడిన లారీలు సిద్ధేశ్వర గుండంలో నిమజ్జనానికి అనుమతించబడవు. ఈవిగ్రహాల నిమజ్జనం కోసం కోట చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువులకు వెళ్లాలి.
- శాయంపేట వైపు నుంచి వచ్చే వినాయక విగ్రహ విహనాలు వయా హంటర్ రోడ్డు, అదాలత్, హనుమకొండ చౌరస్తా మీదుగా వెళ్లాలి.
- కోట చెరువు వైపు నిమజ్జనం కోసం వచ్చే వాహనాలు పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్డు జంక్షన్, ఎంజీఎం, ఆటోనగర్ మీదుగా కోట చెరువుకు చేరుకోవాలి.
- ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, వడ్డేపల్లి ప్రాంతాల నుంచి వచ్చే వినాయక విగ్రహాలు అన్ని బంధం చెరువులో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది.
- చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేసిన అనంతరం వాహనాలు ఏనుమాముల రోడ్డు నుంచి నర్సంపేట రోడ్డు వైపునకు వెళ్లాలి.
- కోట చెరువులో వినాయక విగ్రహ నిమజ్జనం అనంతరం వాహనాలు హనుమాన్ జంక్షన్, పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ జంక్షన్ మీదుగా తిరిగి వెళ్లాల్సి ఉంటుంది.

మంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

● చీఫ్ విప్ వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అక్టోబర్ 6న జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో ముమ్మర ఏర్పాట్లు చేయాలని చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ మట్లాడుతూ హనుమకొండ, వరంగల్ పట్టణాల్లో మంత్రి కేటీఆర్ పర్యటన ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖ అధికారులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటనకు బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. హెలీపాడ్, సభాస్థలిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, సీపీ రంగనాథ్, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం

కాజీపేట అర్బన్: వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దామని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా మంగళవారం 31వ డివిజన్ పరిధి న్యూశాయంపేట జంక్షన్‌లోని ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిని అధికారింగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో చాకలి ఐలమ్మ పేరిట భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రధాన కూడళ్లలో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ పసునూరి దయాకర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, మానస, తదితరులు పాల్గొన్నారు.

ధార్మికభావనతోనే శాంతిసామరస్యాలు

● వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



నృత్యకళాకారులతో సీపీ, తదితరులు

హన్మకొండ కల్చరల్ : ధార్మికభావనతోనే సమాజంలో శాంతి సామరస్యాలు, సౌభ్రాతృత్వం విరాజిల్లుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. మంగళవారం రాత్రి వేయిస్తంభాల దేవాలయంలో ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీపీ రంగనాథ్, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఎస్ వెంకటేశ్వరరావు, ఆలయ ఈఓ వెంకటయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీఉత్థిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన నృత్య కళాకారులు, గురువులను సన్మానించి బహుమతులు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ నేడు జరగనున్న గణేష్ నిమజ్జనాన్ని నగర ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరిండెంటెంట్ చంద్రశేఖర్, బహుమతుల దాత గట్టు మహేష్‌బాబు, మంచికట్ల గోపీనాథ్, ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

వేయిస్తంభాల దేవాలయంలో మహాపూర్ణాహుతి..

గణపతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాలలో వేదపండితుడు గంగు మణికంఠశర్మ గణపతి నవగ్రహ రుద్రహోమం, మహాపూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అనంతరం చందుపట్ల సత్యపాల్ రెడ్డి సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరిగింది. కాగా, బుధవారం కలశ ఉద్వాసన, ఉత్సవవిగ్రహ ఉద్వాసన, సాయంత్రం మహాశోభాయాత్ర ప్రారంభమవుతుందని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. స్వామివారి నిమజ్జనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆయన పేర్కొన్నారు.

భవనంపై నుంచి పడి తాపీమేస్త్రీ మృతి



బాబు (ఫైల్)

పాలకుర్తి టౌన్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ తాపీమేస్త్రీ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన పాలకుర్తి మండలం గూడూరులో జరిగింది. గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ చెరిపెల్లి బాబు(38) గ్రామంలో ఇల్లందుల మల్లయ్యకు చెందిన ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మొదటి అంతస్తు వద్ద గల గోవా కర్రలు విరిగిపోవడంతో అక్కడి నుంచి జారి కింద పడ్డారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పార్కు నిర్వహణ ఏజెన్సీకి అప్పగించండి

● 'సరిగమపదనిస' వినియోగంలోకి తేవాలి
● క్షేత్రస్థాయిలో పరిశీలించిన 'కుడా' వైస్ చైర్మన్



ధ్వంసమైన సంగీత ఆకృతులను పరిశీలిస్తున్న 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: హనుమకొండ పద్మాక్షి దేవాలయానికి సమీపంలోని సరిగమపదనిస పార్కు నిర్వహణను ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించాలని 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం పార్కును అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్కులో ధ్వంసమైన విగ్రహాలను, లైటింగ్‌ను పరిశీలించిన అనంతరం అధికారులతో చర్చించారు. పటిష్ట, సమర్థవంతమైన నిర్వహణ కోసం బాధ్యతలు ఇతర సంస్థకు ఇవ్వాలని సూచించారు. వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్‌ను మోడ్రన్ బస్‌స్టేషన్‌గా పునర్నిర్మిస్తున్న నేపథ్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లను పరిశీలించారు. బస్సుల రాకపోకలు తాత్కాలిక బస్‌స్టేషన్‌లో వెంటనే జరగాలని, కొత్త బస్‌స్టేషన్ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వరంగల్ ఎల్బీనగర్‌లో రూ.1.50 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న షాదీఖానా పనుల పురోగతిని పరిశీలించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వైస్ చైర్మన్ వెంట పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, సిబ్బంది ఉన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు విద్యుత్ అందించాలి

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: ఎలక్ట్రిక్ వాహనాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 16 జిల్లాల ఎస్ఈలు, ప్రధాన కార్యాలయం సీజీఎంలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారిపేట, పీచర, జైనథ్, పమ్మి, ఏనుగల్లు - పర్వతగిరిలో నిర్మిస్తున్న సబ్ స్టేషన్ల పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 33/11 కేవీ ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్ లేకుండా చూడాలని, అంతరాయాలు తగ్గించేందుకు సిస్టం మెయింటనెన్స్ చేసుకోవాలన్నారు. దత్తత గ్రామాల్లో అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వినియోగదారుల ట్విట్టర్, ఫోన్, ఇతర మాధ్యమాల ద్వారా చేసిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి. తిరుపతి రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు టి.సదర్ లాల్, బి.అశోక్ కుమార్, వి.మోహన్ రావు, మధుసూదన్, కిషన్, భీకంసింగ్, రవీంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల ర్యాలీ

● రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కేయూ క్యాంపస్ : తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలోని కొందరు కాంట్రాక్టు లెక్చరర్లు మంగళవారం క్యాంపస్‌లోని పరిపాలనాభవనం నుంచి కేయూ క్రాస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ జేఏసీ చైర్మన్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడుతూ యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కొంతకాలంగా అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డితో సహా ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులను కూడా కలిశామన్నారు. అయినా తమ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోవంతో విధులు బహిష్కరించి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్‌రావు, చందూలాల్, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, ఆర్‌డి ప్రసాద్, అనిల్‌కుమార్,. వెంకటేశ్వర్లు, కల్ప న, స్వప్న, శ్రీలత, మంజుల, రాజశ్రీ, రమేష్, అమరేందర్‌రెడ్డి, శివప్రసాద్, రాజన్‌బాబు, గడ్డం కృష్ణ, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పరశురాములుకు ఎన్ఎస్ఎస్ అవార్డు

● 29న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం



పరశురాములను అభినందిస్తున్న కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ గుండె పరశురాములు 2021-2022 సంవత్సరానికి సంబంధించి ఎన్ఎస్ఎస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు 'మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ అఫైర్స్' భారత ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు సోమవారం రాత్రి సమాచారం అందించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామానికి చెందిన గుండె పరశురాములు కేయూ పరిధిలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2019-2021లో బీకాం చదివారు. ఈ సమయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పలు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు ఈనెల 29న న్యూఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా పరశురాములు ఎన్ఎస్ఎస్ అవార్డును అందుకోబోతున్నారని కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పరుశరాములను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్‌రా వు, మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లయ్య అభినందించారు. కాగా, తాను ఎన్ఎస్ఎస్ అవార్డుకు ఎంపికకావడం ఆనందంగా ఉందని పరశురాములు తెలిపారు.

పోలీసులపై ఎన్‌హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు

వరంగల్ క్రైం: తనను అకారణంగా బంధించి సుమారు 10 మంది పోలీసులు ఇష్టారీతిన దాడికి పాల్పడ్డారని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)లో రిటైర్డ్ మేజర్ డాక్టర్ సచిన్ ఫిర్యాదు చేశారు. ఈనెల 13న కలెక్టరేట్‌లో ఉన్నతాధికారుల సమావేశం దగ్గర పోలీస్, ప్రభుత్వాధికారులతో వాగ్వాదానికి దిగిన రిటైర్డ్ మేజర్ సచిన్‌ను సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకొని 41 సీఆర్‌పీసీ కింద స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. అనంతరం రిటైర్డ్ మేజర్ డాక్టర్ సచిన్ తనను సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకొని తనపై దాడి చేసి తన ఫోన్, కారును లాక్కున్నారని, తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని, ఆతర్వాత రోడ్డుపై వదిలేయడంతో కొంతమందిని డబ్బులు అడుక్కుని హైదరాబాద్ ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందానని, తనపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎన్‌హెచ్‌ఆర్సీ ఫిర్యాదు చేశారు. దీనిపై సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్‌ను వివరణ కోరగా.. రిటైర్డ్ మేజర్ డాక్టర్ సచిన్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని, పోలీస్, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను నెట్టివేస్తూ.. బెదింపులకు పాల్పడారని తెలిపారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపినట్లు తెలిపారు. సెల్ ఫోన్, కారును తీసుకెళ్లాలని సూచించినప్పటికీ సచిన్ తీసుకెళ్లలేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈఏడాది జనవరిలో ఆయన దగ్గరున్న రెండు తుపాకులను కాజీపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, తిరిగి తీసుకెళ్లాలని చెప్పినా.. వాటిని కూడా ఆయన తీసుకుపోలేదని తెలిపారు. రిటైర్డ్ మేజర్ డాక్టర్ సచిన్ కాంట్రాక్ట్ పద్ధతిన వరంగల్ ఎన్ఐటీలో పని చేశారని, అక్కడ సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడంతో ఎన్ఐటీ అధికారులు అతడిని విధుల నుంచి తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు.

అధికారంలోకి రాగానే కబ్జాలపై ఉక్కుపాదం

● డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి




మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నాయిని

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. వరంగల్ పశ్చిమ నియోజకర్గంలో ఎమ్మెల్యే, ఆయన అనుచరుల అక్రమాలు, భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని డీసీసీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయిని మాట్లాడుతూ.. హంటర్‌రోడ్ జూపార్క్ ఎదురుగా ఉన్న వెయ్యి గజాల స్థలాన్ని వినయ్‌భాస్కర్ వెంట ఉండే శేషగిరిరావుకు కట్టబెట్టాడని ఆరోపించారు. వినయ్‌భాస్కర్ అక్రమ ఆస్తులను ఎప్పటికప్పుడు మద్రాస్‌కు తరలిస్తున్నారని, ఇకపై అతడిని మద్రాస్ బాబు అని పిలవాలని ఎద్దేవా చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, తోట వెంకటేశ్వర్లు, నాయకులు బంక సరళ, బొమ్మతి విక్రమ్, మీర్జా అజీజుల్లాబేగ్, గుంటి స్వప్న, రహమున్నీసాబేగం, పల్లె రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పట్టని సర్కార్

ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. నిరవధిక సమ్మె చేస్తున్న ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులకు నాయిని రాజేందర్ రెడ్డి సంఘీభావం తెలిపారు.

శ్రీవరసిద్ధి వినాయక మండలికి ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న శ్రీవరసిద్ధి వినాయక మండలి సభ్యులు

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రకృతికి అనుగుణంగా, ఐకమత్యం, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన మండళ్లను ప్రోత్సహిస్తూ ప్రతి సంవత్సరం వరంగల్ గణపతి నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం హనుమకొండ నందిహిల్స్‌కు చెందిన శ్రీ వరసిద్ధి వినాయక మండలి ప్రథమ, వరంగల్ ఓసిటీ గజానన మండలి ద్వితీయ బహుమతులు సాధించాయి. ఈ మేరకు బుధవారం గణపతి నిమజ్జనోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం హంటర్‌రోడ్‌లోని విష్ణుప్రియగార్డెన్స్‌లో బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఉత్సవ సమితి కన్వీనర్ న్యాలకొండ భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వామి చైతన్యానంద మహారాజ్, వీహెచ్‌పీ తెలంగాణ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం యాదిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. కాగా, ఆదర్శ, ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక, ప్రోత్సాహక విభాగాల్లో 113 మండళ్లకు బహుమతులు అందజేశారు.